# ఆర్థికమంత్రి సిఫార్సు.. సీఎం ఆమోదం

## గుత్తేదారుల ఒత్తిడికి తలొగ్గిన సర్కారు



**గుత్తేదారుల ఒత్తిడికి ప్రభుత్వం తలొగ్గింది. అదనంగా చెల్లించడానికి అంగీకరించింది. ఇక నుంచి కొత్తగా టెండర్లు ఖరారు చేసే పనులకు స్టీలు, సిమెంటు, డీజిల్‌తోపాటు లేబర్, మెటీరియల్‌పైనా పెరిగిన ధరలు వర్తించే నిబంధన పెట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులో స్పష్టం చేసింది. ఆర్థికశాఖ అధికారులు అభ్యంతరాలు వ్యక్తం చేసినా, ఎంత ఆర్థిక భారం పడుతుందో స్పష్టం చేయాలని కోరినా ఫలితం లేకపోయింది. ఆర్థికశాఖ మంత్రి, ముఖ్యమంత్రి ఆమోదంతో ఉత్తర్వులు వెలువడినట్లు సంబంధిత వర్గాలద్వారా తెలిసింది.**

ఈనాడు - హైదరాబాద్

**2004**లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం జలయజ్ఞాన్ని ప్రారంభించింది. రూ.46వేల కోట్లతో 26 ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటించి 2009 అసెంబ్లీ ఎన్నికల నాటికి ప్రాజెక్టుల సంఖ్యను 86కు పెంచింది. దీంతో నిర్మాణ వ్యయం రూ.1.86 లక్షల కోట్లకు పెరిగింది. ఈపీసీ పద్ధతిలో ఒప్పందం చేసుకున్నందున నిర్ధిష్ట వ్యవధిలో, ఒప్పందం చేసుకున్న మొత్తంతోనే పనులు పూర్తవుతాయని ప్రభుత్వం ప్రకటించింది. కానీ ఆచరణలో అందుకు భిన్నంగా జరిగింది. ఆరంభం నుంచే ఒప్పందానికి గుత్తేదారులు తిలోదకాలివ్వగా, ప్రభుత్వం పూర్తిగా సహకరించింది. మట్టిపని చేసి, ఈపీసీ పేరుతో చేసిన దానికంటే ఎక్కువ మొత్తం తీసుకున్న గుత్తేదారులు, నిర్మాణాలు (స్ట్రక్చర్లు) చేపట్టకుండా వదిలేశారు. దీంతో ఒప్పందం ప్రకారమే స్టీలు, సిమెంటు ధరలు పెరిగి ఖజానాపై వేల కోట్ల రూపాయల భారం పడింది. మరోవైపు ఒప్పందంలో లేని వాటికీ అదనంగా చెల్లించాలని గుత్తేదారులు కోరగా 2011 మార్చి 17న నీటి పారుదలశాఖ ప్రత్యేకంగా ఒక సమావేశాన్ని నిర్వహించింది. నీటి పారుదలశాఖ అధికారులు, సీనియరు ఇంజినీర్లు, గుత్తేదారులు సంయుక్తంగా చర్చించి ఈపీసీకి తిలోదకాలిచ్చి ఒప్పందంలోని లేని వాటికీ అదనంగా చెల్లించడానికి సిఫార్సు చేశారు. అప్పటి నుంచి ప్రయత్నాలు ముమ్మరమయ్యాయి. దీనిపై ఆర్థికశాఖ నుంచి సానుకూలత వ్యక్తం కాకపోవడంతో ప్రభుత్వం సీనియరు మంత్రులతో ఉపసంఘాన్ని ఏర్పాటు చేసింది. ఉపసంఘం పలు దఫాలు సమావేశమై ఈపీసీ ఒప్పందానికి విరుద్ధంగా అదనంగా చెల్లించడానికి అనుకూలంగా సిఫార్సు చేసింది. ఈ నివేదికకు మంత్రివర్గం ఆమోదం తెలపడంలో జాప్యం కావడంతో నేరుగా ముఖ్యమంత్రే ఆమోద ముద్ర వేశారు. ఆర్థికశాఖ అధికారులు కొన్ని అభ్యంతరాలు వ్యక్తం చేయడంతో కొన్నాళ్లు పెండింగులో పడింది. చివరకు ఆర్థిక మంత్రి సిఫార్సు చేయడం, ముఖ్యమంత్రి రెండోసారి ఆమోదం తెలపడంతో ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## గత ఏడాది పనులకూ తాజా ధరల వర్తింపు

### ఉత్తర్వుల్లోని ముఖ్యాంశాలివి..

- 2013 ఏప్రిల్ ఒకటి నుంచి చేసిన పనికి, ప్యాకేజీ వారీగా మిగిలి ఉన్న పనికి లేబర్, మెటీరియల్‌కు తాజా ధరలను ప్రభుత్వం చెల్లిస్తుంది. మిగిలిన పనికి లేబర్, మెటీరియల్ పైన ఎంత అదనంగా చెల్లించాల్సి వస్తుందనేది ముందుగానే నిర్ధారణకు రావాలి. ప్రపంచ బ్యాంకు, జపాన్ ఆర్థిక సహకార సంస్థ( జైకా) టెండర్లలో అంచనా వేసినట్లుగా ఇక్కడా వేయాలి.
- డిస్ట్రిబ్యూటరీల నిర్మాణానికి 2010 జనవరిలో నీటి పారుదలశాఖ జారీ చేసిన మెమో ఆధారంగా అన్ని ప్రాజెక్టుల్లో (అంతకు ముందు ఒప్పందాలు జరిగిన వాటిలోనూ...) చెల్లించాలి. దీని ప్రకారం ఎకరా ఆయకట్టుకు రూ.10,500 వంతున చెల్లించాల్సి ఉంటుంది.
- కూలీలకు ధరల నిర్ణయంలో స్టాండర్డ్ డేటా ఆధారంగా పారదర్శకంగా చేయాలి. ఇతర మెటీరియల్‌కు పీడబ్ల్యూడీ, ఐఎస్ కోడ్‌లను అమలు చేయాలి. ఎలక్ట్రో మెకానికల్, హైడ్రో మెకానికల్ పరికరాలకు, పంపులకు సంబంధిత కోడ్‌ల ఆధారంగా పెరిగిన ధరలను వర్తింపజేయాలి.
- అటవీ, పర్యావరణ అనుమతులను వెంటనే పొందడానికి, అవసరమైన మేరకు భూసేకరణ వేగంగా చేయడానికి నీటి పారుదలశాఖ చర్యలు తీసుకోవాలి.
- పెండింగులో ఉన్న పనిని అంచనా వేయడం, డిజైన్ల తయారీ, ఆమోదానికి నిర్దిష్ట సమయాన్ని నిర్ణయించి దీనికి తగ్గట్లుగా గడువును పొడిగించాలి.
- ఒప్పందంలో పొందుపరచకుండా కంట్రోల్ బ్లాస్టింగ్ (రాళ్లు పక్కనున్న గ్రామంపైన పడకుండా పేల్చడం) చేయాల్సి వస్తే నిపుణుల కమిటీని నియమించి ఆ కమిటీ సూచనల ఆధారంగా చేసిన పనికి చెల్లించాలి. ఇందుకోసం జిల్లా కలెక్టరు, ఎస్పీ నుంచి వాస్తవ నివేదికను తెప్పించుకోవాలి.
- డిజైన్‌లో మార్పుల కారణంగా, నిర్మాణ స్థలంలోని పరిస్థితిని బట్టి నీటి ప్రవాహ మార్గాన్ని మార్చాల్సి వచ్చినప్పుడు అంచనాలో పేర్కొన్న దానికంటే ఎక్కువ పని చేయాల్సి వస్తే ఆ మేరకు అదనంగా చెల్లించాలి.
- ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంవల్ల అదనంగా చెల్లించాల్సిన మొత్తాన్ని 2013 ఏప్రిల్ రెండు నాటికి అమలులో ఉన్న ఒప్పందాలకు ప్యాకేజీ వారీగా పనిని అంచనా వేసిన తర్వాతే చెల్లించాలి.
- 2013 ఏప్రిల్ ఒకటి నుంచి చేసిన పనికి లేబర్, మెటీరియల్‌కు పెరిగిన ధరలను చెల్లించాలని నిర్ణయించినందున ప్యాకేజీల వారీగా చెల్లింపులకు ప్రభుత్వం ఆదేశాలు జారీచేసిన తర్వాత మొదట 40శాతం బకాయిలు (అరియర్స్) చెల్లిస్తారు. చేసిన పనికి చెల్లించే బిల్లులతోపాటు 30శాతం, పని పూర్తి చేసిన తర్వాత చెల్లించే బిల్లుతో కలిపి మిగిలిన 30శాతం చెల్లిస్తారు. అంటే ఏ ప్యాకేజీలో ఎంత అదనంగా చెల్లించాల్సి వస్తుందో అంచనా వేసి ప్రభుత్వం నుంచి ఆమోదం పొందగానే 40శాతం అందుతాయి.
- పని జాప్యానికి గుత్తేదారు కారణం కాదని సంబంధిత ప్రాజెక్టు ఇంజినీరు ధ్రువీకరించాల్సి ఉంటుంది. వాస్తవానికి గుత్తేదారులది కారణమైనా కాదని సంబంధిత ఇంజినీర్లు సిఫార్సు చేయడంతో పలు దఫాలు నిర్మాణ గడువును పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.
- మిగిలిన పని ఎంత? ఎప్పటిలోగా పూర్తి చేయాలన్న దానిపై గుత్తేదారు, నీటి పారుదలశాఖ ఓ నిర్ణయానికి వచ్చి అనుబంధ ఒప్పందం చేసుకోవాలి. తర్వాత గడువు పొడిగింపు ఉండరాదు. అయితే భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతులవల్ల జాప్యమైతే గడువు పొడిగిస్తారు. వాస్తవానికి ఇప్పటివరకూ ఒక్కో ప్యాకేజీ నిర్మాణ గడువును ఆరేడుసార్లు పొడిగించినప్పుడు నీటి పారుదలశాఖ చూపిన కారణాల్లో ఎక్కువ భాగం ఇవే. ఒకవైపు మిగిలిన పనిని, అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకుని పని పూర్తికి అనుబంధ ఒప్పందం చేసుకోవాలి. మళ్లీ గడువు పొడిగింపు ఉండదంటూనే భూసేకరణ, అటవీ, పర్యావరణ అనుమతుల విషయంలో మినహాయింపు ఇచ్చింది. అంటే ప్రాజెక్టులను పూర్తి చేయాలన్న లక్ష్యంతో వేల కోట్ల రూపాయల అదనపు భారం భరించడానికి ప్రభుత్వం సిద్ధపడినా, మళ్లీ గడువు పొడిగించడానికి అవకాశం ఇవ్వడం ద్వారా జలయజ్ఞం ప్రాజెక్టులు ఇప్పుడిప్పుడే పూర్తయ్యే అవకాశం లేదని చెప్పకనే చెప్పింది.
- ఇప్పటికే గుత్తేదారులపై సెక్షన్-61 కింద, సెక్షన్ 60 కింద చర్యలు తీసుకుని ఉంటే అలాంటి చోట అదనపు చెల్లింపులు ఉండవు. సెక్షన్ 61 కింద నోటీసు ఇచ్చి ఉంటే తుది నిర్ణయం జరిగే వరకూ అదనపు చెల్లింపులు చేయరు. లిక్విడేట్ డ్యామేజెస్ (నష్టపరిహారం) విధించి ఉంటే ఆ కొద్ది పనికి మాత్రం అదనపు చెల్లింపులు చేయరు.
- బ్యాంకు గ్యారంటీల కమీషన్, బీమా ప్రీమియాన్ని మొదటి ఒప్పందం గడువు తర్వాత గుత్తేదారు ఎంత మొత్తం చెల్లించి ఉంటే ఆంత ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది. సేవా పన్నును ప్రభుత్వం తిరిగి చెల్లిస్తుంది.
- 18 నెలలకుపైగా పని జరగని చోట, దానికి గుత్తేదారు కారణం కాకపోతే ఎలాంటి పెనాల్టీ లేకుండానే గుత్తేదారు తప్పుకోవచ్చు.